

సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు

# అవిశ్వాసానికి పావులు

- మేయర్‌ను గద్దె దించేందుకు బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్ల రహస్య సమావేశం
- పార్టీ పెద్దల సలహాతో గైర్హాజరైన కాంగ్రెస్ కార్పొరేటర్లు
- బడ్జెట్ సమావేశం అడ్డుకునేలా ప్రణాళికలు

వరంగల్, జూన్ 18: వరంగల్ గ్రేటర్ కార్పొరేషన్ మేయర్ గుండు సుధారాణిపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు బీఆర్ఎస్ కార్పొరేటర్లు పావులు కదుపుతున్నారు. బీజేపీ కార్పొరేటర్లు, మరికొంత మంది అధికార కాంగ్రెస్ పార్టీ వారిని కలుపుకొని అవిశ్వాస తీర్మానం పెట్టాలనే పట్టుదలతో మంతనాలు సాగిస్తున్నారు. దీనిలో భాగంగానే మంగళవారం కొంతమంది బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ మసూద్ చాంబర్‌లో రహస్య సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ నుంచి మరుపల్ల రవి, దిడ్డి కుమారస్వామి, సిద్దం రాజు, కార్పొరేటర్ల భర్తలు బోగి సురేశ్, బస్వరాజ్ శ్రీమాన్, ఎండీ మసూద్, సుంకరి శివ, బీజేపీ కార్పొరేటర్లు దాస్యం అభినవ భాస్కర్, గుజ్జుల వసంత పాల్గొన్నారు. ఈ నెల 20వ తేదీన నిర్వహించే బడ్జెట్ సమావేశాన్ని సైతం అడ్డుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుత పాలక మండలిలో బీఆర్ఎస్‌కు 22 మంది కార్పొరేటర్లు ఉండగా, బీజేపీకి 10, కాంగ్రెస్‌కు 34 మంది ఉన్నారు. అవిశ్వాస తీర్మానంపై నోటీసు ఇవ్వాలంటే 36 మంది కార్పొరేటర్లు సంతకాలు పెట్టాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లతో పాటు అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు కలిసి వస్తేనే అవిశ్వాస తీర్మానం పెట్టే పరిస్థితి ఉంటుంది. మొన్నటి వరకు బీఆర్ఎస్ పార్టీలో ఉండి ప్రస్తుతం అధికార కాంగ్రెస్‌లో చేరిన మేయర్‌కు చుక్కలు చూపెట్టాలన్న లక్ష్యంతో బీఆర్ఎస్ కార్పొరేటర్లు కార్యాచరణ చేస్తున్నారు.

### గైర్హాజరైన కాంగ్రెస్ కార్పొరేటర్లు

మేయర్‌పై అసంతృప్తితో ఉన్న కాంగ్రెస్ కార్పొరేటర్లను పార్టీ ఎమ్మెల్యేలు కట్టడి చేసినట్లు విశ్వసనీయ సమాచారం. వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట నియోజవర్గానికి చెందిన కార్పొరేటర్లను ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, తూర్పులో సీనియర్ నాయకుడు నవీన్‌రాజ్ ఫోన్లు చేసి మందలించినట్లు తెలిసింది. దీంతో సమావేశానికి వారు గైర్హాజరయ్యారు.

### నేడు బీఆర్ఎస్ కార్పొరేటర్ల సమావేశం

ఈ నెల 20వ తేదీన జరిగే బల్దియా బడ్జెట్ సమావేశంలో వ్యవహరించాల్సిన వ్యూహంపై బీఆర్ఎస్ కార్పొరేటర్లు హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అధ్యక్షతన బుధవారం పార్టీ కార్యాలయంలో చర్చించనున్నారు. బడ్జెట్ సమావేశం, అవిశ్వాస తీర్మానం లాంటి అంశాలపై మాట్లాడనున్నట్లు కార్పొరేటర్లు తెలిపారు. దీంతోపాటు వర్షాకాలం వస్తున్న తరుణంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించి డివిజన్లవారీగా ముంపు నివారణపై చర్చించాల్సిన అవసరం ఉందంటున్నారు.



రోడ్డుపై అడ్డుగా ఉన్న చెట్లను తొలగిస్తున్న ఉపాధి కూలీలు, తొలగించిన తర్వాత రోడ్డు

# రోడ్డుపై చెట్ల కొమ్మల తొలగింపు

నమస్తే ఎఫెక్ట్

శాయంపేట జూన్ 18 : రోడ్డు పక్కన ఇష్టారాజ్యంగా చెట్లను నరికి పడేసిన కొమ్మలను ఎట్టకేలకు మంగళవారం తొలగించారు. శాయంపేట మండలం కొత్తగట్టు సింగారం–శాయంపేట ప్రధాన దారిపై హరితహారంలో నాటిన అవెన్యూ ప్లాంటేషన్ చెట్లను రోడ్డుకు అడ్డంగా ఉంటున్నాయని ఉపాధి కూలీలతో అధికారులు నరికి వేయించి కొమ్మలు అలాగే పడేశారు. రోజుల తరబడి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో ఈ నెల 14న 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన 'రోడ్డు ఇలా.. ప్రయాణం సాగేదెలా' కథనానికి స్పందించిన కొత్తగట్టుసింగారం ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ రాజమల్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంగళవారం ఉపాధి కూలీలతో చెట్ల కొమ్మలను వేరే చోట వేయడంతో రోడ్డు శుభ్రంగా మారి రాకపోకలు సులువయ్యాయి. దీంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.


# 24 నుంచి జూడాల నిరవధిక సమ్మె

కాశీబుగ్గ, జూన్ 18: తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు అసోసియేషన్ బాధ్యులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం వైద్య విద్య డైరెక్టర్ డాక్టర్ వాణిని కలిసి నోటీసు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత నెలలో తాత్కాలికంగా నిలిపివేసిన సమ్మెను తిరిగి కొనసాగించనున్నట్లు తెలిపారు. సమ్మె నోటీసులు ఇచ్చినా తమ ప్రతిపాదనలు ఒక్కటి కూడా నెరవేరలేదన్నారు. గత సమ్మె సమయంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రభుత్వం ఆర్డర్ జారీ చేయలేదన్నారు. తాము నోటీసు ఇచ్చి నెల రోజులు గడిచినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం వల్ల తిరిగి సమ్మె చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 24 నుంచి తమ డిమాండ్లు నెరవేరే వరకూ సమ్మెను నిరవధికంగా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జూనియర్ డాక్టర్లు సాయి శ్రీహర్ష, ఇసాక్ న్యూటన్, శ్రీనాథ్, సందీప్, అజయ్ ప్రకాశ్, సురేశ్, బాల ప్రశాంత, అసీస్ ఉన్నారు.

# ఉన్నట్టా.. లేనట్టా!?

ఉత్తర్వుల జారీపై సర్కారు జాప్యం

పదవీ యోగంపై అందరిలో సందేహాలు



## నామినేటెడ్ పోస్టులపై నేతల్లో టెన్షన్

*నామినేటెడ్ పోస్టులపై అధికార పార్టీ నేతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పార్టీ నాయకులకు ఇచ్చిన పదవుల వ్యవహారం ఇప్పుడు నవ్వులాటగా మారింది. పోస్టులను ప్రకటించిన రోజు నుంచి లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా ఎవరూ బాధ్యతలు చేపట్టకపోగా, అసలు తమకు నిజంగానే పదవి ఉందా? లేదా? అనే సందేహం వ్యక్తమవుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆరుగురికి చోటు దక్కినప్పటికీ పోస్టుల భర్తీపై పార్టీలోనే అసంతృప్తి నెలకొనడం ఇందుకు కారణంగా కనిపిస్తోంది. తమ ప్రతిపాదనలను పరిగణలోకి తీసుకోకుండానే పార్టీ గెలుపు కోసం పనిచేయని వారికి పదవులిచ్చారని మంత్రులు, ఇన్‌చార్జి మంత్రి, ఎమ్మెల్యే అధిష్టానం దృష్టికి తీసుకెళ్లగా, మరోసారి జాబితా పంపాలని సూచించినట్లు చర్చ నడుస్తోంది. అదే జరిగితే మళ్లీ మొదటికి వచ్చినట్టేనా అని ఆశావహులు తలలు పట్టుకుంటున్నారు.*

*- వరంగల్, జూన్ 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

- పార్టీ కోసం పనిచేయని వారికి ఎందుకని చర్చ
- నియామకాలపై మంత్రులు, ఇన్‌చార్జి మంత్రుల అసంతృప్తి
- మరోసారి జాబితా పంపాలని అధిష్టానం సూచనలు!

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ పార్టీ నాయకులకు ఇచ్చిన నామినేటెడ్ పదవుల వ్యవహారం ఇప్పుడు నవ్వులాటగా మారింది. పదవులు పొందిన నేతలే నిజంగా తమకు పదవి ఉందా? లేదా? అని సందేహ పడుతున్నారు. పోస్టుల్లో నియమితులైన వారు ఇప్పటికీ బాధ్యతలు చేపట్టలేదు. అసలు ఆ యోగం ఉంటుందో లేదో అనే అనుమానంతో ఉన్నారు. పదేండ్ల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పదవులు ఇస్తే వాటిని చేపట్టకపో యే పరిస్థితి రావడం ఏమిటని వీరంతా ఆందోళన చెందుతున్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు సమీక్షించి పనిచేసిన వారు, గెలుపోటములు.. అన్నింటినీ ప్రామాణికంగా తీసుకుని పదవులను కొనసాగించాలా? లేదా అనేది నిర్ణయిస్తామని ఇటీవల కాంగ్రెస్ అధిష్టానం చెప్పినట్లు పార్టీలో చర్చ జరుగుతున్నది. మంత్రుల అభిప్రాయాలు, ఇన్‌చార్జి మంత్రి ప్రతిపాదనలను పరిగణలోకి తీసుకోవాలని ఇటీవల కాంగ్రెస్‌లో చర్చ మొదలైంది. ఇవన్నీ జరిగే వరకు ఎన్ని నెలలు పడుతుందో? పదవి ఎప్పుడు వస్తుందో? అని జాబితాలో ఉన్న వారు ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల ముందు తమకు ఇచ్చిన పదవులు వట్టివేనా అని లోలోపల మదనపడుతున్నారు.

**ఉమ్మడి జిల్లాలో ఆరుగురికి..**

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం పలువురు కాంగ్రెస్ నేతలకు నామినేటెడ్ పదవులను ఖరారు చేసింది. ఎన్నికల షెడ్యూల్‌కు ముందు తేదీల్లోనే పదవులను భర్తీ చేసినట్లు పేర్కొన్నా.. షెడ్యూల్ అమలులోకి వచ్చిన తర్వాత ఈ ప్రకటనను బహిరంగంగా వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా 37 మందిని వివిధ కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో భర్తీ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆరుగురు పదవులు దక్కిన జాబితాలో ఉన్నారు. వరంగల్ పశ్చిమ సెగ్మెంట్ టికెట్ ఆశించిన జంగా రాఘవరెడ్డిని ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్‌గా, మహబూబాబాద్ ఎంపీ సీటు ఆశించిన బెల్లయ్య నాయక్‌ను గిరిజన కో–ఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా, ములుగు మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యను ఫారెస్ట్ డెవలప్‌మెంట్ చైర్మన్‌గా, పీసీసీ అధికార ప్రతినిధి ఎండీ రియాజ్‌ను గ్రంథాలయ పరిషత్ చైర్మన్‌గా, భూపాలపల్లి జిల్లాకు చెందిన అయిత ప్రకాశ్‌రెడ్డిని స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా, పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న ఇనుగాల వెంకట్రాంరెడ్డికి కాకతీయ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ(కుడా) చైర్మన్‌గా నియమించారు. లోక్‌సభఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత ఈ నియామకాలను ప్రకటించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు రెండు రోజుల ముందు తేదీ పెట్టి ఈ ప్రకటనను విడుదల చేశారు. నామినేటెడ్ పోస్టులను ప్రకటించిన రోజు నుంచి లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ఎవరూ బాధ్యతలు స్వీకరించలేదు. ఈ పదవులు తమకు ఉంటాయా? ఉండవా అనే ఆందోళనలోపదవులు పొందిన వారు ఉన్నారు.

**మళ్లీ మొదటికి..**

నామినేటెడ్ పదవుల భర్తీపై కాంగ్రెస్ పార్టీలో రచ్చ మొదలైంది. తమను, తమ ప్రతిపాదనలను కనీసం పరిశీలించకుండా పదవులు ఇచ్చారని, ఇది పార్టీకి నష్టం చేస్తుందని మంత్రులు, ఎమ్మెల్యేలు కాంగ్రెస్ అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లారు. నామినేటెడ్ పోస్టుల జాబితాలో ఉన్న వారిలో కొందరు లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు కోసం పని చేయలేదని, ఇలాంటి వారికి పదవులు ఇస్తే పార్టీలో తప్పుడు సంకేతాలు పోతాయని చర్చ మొదలైంది. నామినేటెడ్ పోస్టుల భర్తీ కోసం మరోసారి ఉమ్మడి జిల్లాల వారీగా జాబితా తయారు చేయాలని ప్రతిపాదన వచ్చినట్లు తెలిసింది. ఎమ్మెల్యేలు, మంత్రులు, ఇన్‌చార్జి మంత్రి కలిసి ఈ ప్రతిపాదనలు పంపేలా అధిష్టానం నుంచి సూచనలు వచ్చినట్లు పార్టీలో చర్చ జరుగుతున్నది. కొత్త ప్రక్రియ మొదలై, ప్రతిపాదనలు అధిష్టానానికి చేరి పోస్టులను భర్తీ చేసే వరకు ఎన్ని రోజులు పడుతుందోనని ఆశావహులు టెన్షన్ పడుతున్నారు.

# న్యాయం కోసం రైతు పోరాటం

- డబ్బులివ్వకుండానే భార్య పేర రిజిస్ట్రేషన్ చేయించిన పెద్దపల్లి ఏసీపీ
- పోలీసులు, ఎమ్మెల్యేకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన
- బంధువులతో కలిసి పురుగుల మందు డబ్బాతో బాధిత వృద్ధుడి ధర్నా
- మద్దతు తెలిపిన టేకుమట్ల మండల రైతులు, ప్రజలు



టేకుమట్ల సెంటర్‌లో ధర్నా చేస్తున్న వృద్ధుడు, బంధువులు



మందు డబ్బాతో వృద్ధుడు రాయమల్లు

టేకుమట్ల, జూన్ 18 : డబ్బులు ఇవ్వకుండానే భూమిని రిజిస్ట్రేషన్ చేసుకొని ఓ వృద్ధుడిపై పోలీస్ అధికారి తన జులుం చూపిస్తున్నాడు. ఆరోగ్యం సహకరించకపోవడంతో తనకున్న భూమిని అమ్మి దవాఖానలో చూపించుకుందామనుకుంటే ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. కొంత డబ్బు ఇచ్చి తన భార్య పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్న సదరు అధికారి మిగతావి ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెడుతున్నాడు. స్థానిక పోలీసులు, ఎమ్మెల్యేకు చెప్పినా న్యాయం జరగడం లేదంటూ ఆ వృద్ధుడు బంధువులతో కలిసి పురుగుల మందు డబ్బాతో ధర్నాకు దిగాడు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలకేంద్రంలో మంగళవారం చోటు చేసుకోగా, రైతులు, స్థానిక ప్రజలు మద్దతుగా నిలిచారు. వివరాల్లోకి వెళితే.. ఆరెపల్లి గ్రామానికి చెందిన ఇటుకాల రాయమల్లుకు సర్వే నెంబర్ 63/అ/1-62/ఇ/1లో ఉన్న 39 గుంటల భూమిని రూ.13.65 లక్షలకు పెద్దపల్లి ఏసీపీగా విధులు నిర్వర్తిస్తున్న అదే గ్రామానికి చెందిన గజ్జి కృష్ణ (ప్రస్తుతం హనుమకొండలో నివాసం ఉంటున్నారు) తన భార్య రాధిక పేరుతో కొనుగోలు చేశారు. ఒప్పందం ప్రకారం మొదట రూ.7 లక్షలు చెల్లించి, రిజిస్ట్రేషన్ సమయంలో రూ. 6.65 లక్షలు ఇవ్వాల్సి ఉంది. అయితే రిజిస్ట్రేషన్ రోజు గ్రామస్తుడు కుర్రె ప్రభాకర్ డబ్బులివ్వమని అడుగగా.. 'యూజ్ లెస్ ఫెల్లో.. నీకెలా కనపడుతున్నాను' అంటూ బూతులు తిడుతూ కారులో కూర్చున్న తన భార్య వద్ద ఉన్న డబ్బుల బ్యాగ్‌ను ఏసీపీ చూపించాడు. రిజిస్ట్రేషన్ అయిన తర్వాత ఇస్తానని చెప్పడంతో రిజిస్ట్రేషన్ చేయించారు. ఆ తర్వాత డబ్బులు ఇవ్వమని అడుగగా ఇక్కడ కాదు.. ఇంటి వద్ద ఇస్తానంటూ వెళ్లాడు. తీరా అక్కడికి వెళ్లి అడుగగా బోర్ రిపేర్ చేస్తేనే మిగతా డబ్బులు ఇస్తాననడంతో ఆ విషయమై కాగితం రాసుకోలేదని, తన డబ్బులు ఇవ్వాలని కోరాడు. పెద్ద మనుషులతో ఒత్తడి చేయగా, లోన్ డబ్బులు రాగానే ఇస్తానని చెప్పి ఇవ్వకపోవడంతో మరోసారి వెళ్లిన వారిని 'ఎందుకు ఇంటికి వస్తున్నారు.. మా పేరు మీదకు భూమి వచ్చింది.. ఎక్కడ చెప్పుకుంటారో చెప్పుకోండి' అంటూ బెదిరించాడు. ఇదే విషయమై టేకుమట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి సీఐ, డీఎస్పీతో పాటు స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును కలిసినా న్యాయం జరగలేదు. దీంతో చావే శరణ్యమని వృద్ధుడు పురుగుల మందు డబ్బాతో మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ధర్నాకు దిగాడు. దీంతో పోలీసులు వచ్చి న్యాయం చేస్తామని హామీ ఇచ్చి ఆందోళనను విరమింపజేశారు.

### డబ్బులు ఇయ్యలేదు..

**– బాషబోయిన రాజయ్య, పెద్ద మనిషి, ఆరెపల్లి**

రిజిస్ట్రేషన్ రోజు డబ్బులు తీసుకు వచ్చారు కానీ, ముసలాయనకు ఇయ్యలేదు. సంతకం పెట్టిన తర్వాత ఇస్తామని అక్కడ ఇయ్యలేదు. ఇంటికి వచ్చి ఇస్తామని చెప్పి బోర్ రిపేర్ చేసిన తర్వాతనే అన్ని డబ్బులు ముట్టచెప్తానని వెళ్లిపోయారు. అసలు రూ. 20 లక్షలకు పైగా పోయే భూమిని రూ. 14 లక్షలకు అమ్మిండు. అండ్ల బోరు పోయించి ఇచ్చుడని బయాన కాగితంలో లేదు. ఉన్నట్లయితే కాగితం చూపించుమంటే చూపించలేదు. మళ్ల డబ్బులు ఇయ్యమని ఇంటికి పోతే మొదట ఇస్తా అన్నడు. తర్వాత ఇయ్యపో అన్నడు. బరాబర్ రూ.6.65లక్షలు ఇయ్యాలె. వాళ్ల తమ్ముడు రమేశ్ కూడా ముసలాయన దగ్గర బయాన డబ్బుల నుంచి రూ. 54 వేలు తీసుకుని నీకు బాకీ ఎక్కడిదని బెదిరిస్తున్నడు. ఇయ్యమని అడిగితే నీకు ఎందుకు.. నువ్వు ముసలోనికి పుట్టినవా అని తిడుతున్నడు.

ఈ విషయమై ఏసీపీ గజ్జి కృష్ణ భార్య రాధికారాణిని వివరణ కోరగా 'మేము ప్రజలకు న్యాయం చేసేటోళ్లం.. వృద్ధుడికి అన్యాయం చేస్తమా? రూ. 6.65 లక్షలు లేకుండా ఉన్నామా? డబ్బులు కట్టకుండా ఎలా రిజిస్ట్రేషన్ చేస్తరు? మా ఎదుగుదలను చూసి ఓర్వలేని మా బంధువులే మమ్మల్ని బదనాం చేస్తున్నరు' అని తెలిపారు.

### భూమి ఆక్రమించాడని ఆర్ఎస్సైపై ఎస్పీకి ఫిర్యాదు

ములుగురూరల్, జూన్18 : పోలీస్ శాఖలో ఆర్ ఎస్సైగా పనిచేస్తున్న అధికారి తన భూమిని ఆక్రమించాడని ఆరోపిస్తూ మంగళవారం ఎస్పీ డాక్టర్ పీ శబరీష్‌కు దేవనగర్ గ్రామానికి చెందిన రైతు బొమ్మరబోయిన కుమార్ ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ సర్వే నంబర్ 91/3లో వారసత్వంగా వచ్చిన ఆరు గుంటల భూమిని ఆర్ఎస్సై గడ్డి ప్రశాంత్ ఆక్రమించాడని అన్నారు. ఈ నెల 10న ప్రశాంత్ పోలీసు అధికారులతో వచ్చి బెదిరింపులకు పాల్పడ్డాడని ఆరోపించారు. అలాగే ఈ నెల 13న హద్దు రాళ్లను తొలగించి ఆరు గుంటల భూమిని అతడి భూమిలో కలుపుకున్నాడన్నారు. విచారణ చేసి తనకు న్యాయం చేయాలని కుమార్ ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

### ఎస్సై దురుసు ప్రవర్తన

- మహిళా కానిస్టేబుల్ మనస్తాపం
- ఎస్పీకి ఫిర్యాదు చేసేందుకు జిల్లా కార్యాలయానికి?

జయశంకర్ భూపాలపల్లి. జూన్ 18 (నమస్తే తెలంగాణ) : జిల్లా సరిహద్దులోని ఓ స్టేషన్ ఎస్సై అంతా తానే అనే అహంతో సిబ్బంది, ఠాణాకు వచ్చే ప్రజలపై దురుసుగా ప్రవర్తిస్తున్నాడు. ఇప్పటికే సదరు అధికారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందగా మందలించి వదిలేశారు. అయినా అతనిలో మార్పు రాలేదు. తన నోటి నుంచి బామ్మర్ది అనే పదం తప్ప వేరే మాటలు రాని ఈ ఎస్సై ఓ మహిళా కానిస్టేబుల్‌పైనా నోరుజారినట్లు తెలిసింది. దీంతో మనస్తాపానికి గురై మంగళవారం ఎస్పీకి ఫిర్యాదు చేసేందుకు జిల్లా కార్యాలయానికి వెళ్లింది. ఎస్పీ అందుబాటులో లేకపోవడంతో బుధవారం కలిసి ఫిర్యాదు చేస్తానని తోటి సిబ్బందితో చెప్పుకున్నట్లు సమాచారం. కాగా, సదరు ఎస్సైపై ఉన్నతాధికారులు చర్యలకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

# పట్టాలివ్వకుంటే ప్రాణత్యాగమే

- న్యాయం జరిగే వరకు ఆందోళనలు విరమించం
- డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద లబ్ధిదారుల వంటావార్పు



డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద భోజనాలు చేస్తున్న లబ్ధిదారులు

కృష్ణకాలనీ, జూన్ 18 : తమకు కేటాయించిన డబుల్ బెడ్రూం ఇండ్లకు పట్టాలివ్వకుంటే ప్రాణత్యాగానికైనా సిద్ధమని లబ్ధిదారులు హెచ్చరించారు. న్యాయం జరిగేంత వరకు ఆందోళనలు విరమించేది లేదని తెగేసి చెప్పారు. భూపాలపల్లి పట్టణంలోని భాస్కర్‌గడ్డలో బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించిన ఇండ్లకు పట్టాలివ్వాలని కొద్దిరోజులుగా లబ్ధిదారులు ధర్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఇండ్ల ఆవరణలో వంట చేసుకొని అక్కడే భోజనాలు చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు రమేశ్, కుమార్, తుకారాం మాట్లాడుతూ వారం రోజులుగా తాము చేస్తున్న ఆందోళనలు కాంగ్రెస్ ప్రభుత్వానికి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే తమను ఎందుకు పట్టించుకోవడం లేదో సమాధానం చెప్పాలన్నారు. తమకు పట్టాలివ్వకుండా ఇబ్బందులకు గురి చేయడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే స్పందించి పట్టాలివ్వాలని కోరారు. లేదంటే కుటుంబ సభ్యులతో వచ్చి తమకు కేటాయించిన ఇండ్లల్లోనే నివాసముంటామన్నారు. కార్యక్రమంలో లబ్ధిదారులు రమేశ్, రాకేశ్, శారద, లత, ప్రవీణ్, సాయి తదితర 200 మంది పాల్గొన్నారు.

### చేయి కోల్పోయిన వృద్ధురాలికి పరామర్శ

- బాధ్యుడైన ఆర్ఎంపీపై కేసు నమోదు
- తెలంగాణ వైద్య మండలి బృందం సభ్యుల వెల్లడి

కాశీబుగ్గ, జూన్ 18: తెలంగాణ వైద్య మండలి బృందం సభ్యులు మంగళవారం వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానను సందర్శించారు. ఈ సందర్భంగా ఇటీవల ఆర్ఎంపీ నిర్లక్ష్యంతో చేయి కోల్పోయిన వృద్ధురాలిని పరామర్శించారు. వివరాల్లోకి వెళ్తే.. హనుమకొండ జిల్లా ఐనవోలుకు చెందిన గ్రామీణ వైద్యుడు పబ్బోజు సంపత్ అదే గ్రామానికి చెందిన ఉప్పలమ్మకు ఇంటి వద్దే సెలైన్ పెట్టాడు. ఈ క్రమంలో చేయికి రక్తం సరఫరా ఆగిపోయి ఇన్‌ఫెక్షన్ అయింది. దీంతో బాధితురాలిని ఎంజీఎం దవాఖానలో చేర్పించగా డాక్టర్లు ఆమె ఎడమ చేయిని తొలగించారు. విషయం తెలుసుకున్న తెలంగాణ వైద్య మండలి నియమించిన విచారణ కమిటీ సభ్యులు డాక్టర్ మాగంటి శేషుమాధవ్ నేతృత్వంలో ఎంజీఎం దవాఖానకు చేరుకొని ఉప్పలమ్మతో పాటు కుటుంబ సభ్యులతో మాట్లాడి ఘటనా వివరాలు తెలుసుకున్నారు. చేయి తొలగించడం వల్లే ఆమె ప్రాణం నిలిచిందని, లేకుంటే ప్రాణం పోయేదని కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు. బాధితురాలికి ఎంజీఎంలో మెరుగైన వైద్యం అందిస్తున్న డాక్టర్లు పూర్ణయ్య, కిశోర్, రూప, అనిల్, పీజీ వైద్యులను కమిటీ బృందం అభినందించింది. బాధితురాలి నుంచి సేకరించిన వివరాలను హైదరాబాద్‌లోని వైద్య మండలికి నివేదిక రూపంలో అందించనున్నట్లు వారు తెలిపారు. ఎన్ఎంసీ చట్టం ప్రకారం ఆర్ఎంపీపై కేసు నమోదు చేయనున్నట్లు విచారణ కమిటీ సభ్యుడు డాక్టర్ నరేశ్‌కుమార్ వెల్లడించారు. కార్యక్రమంలో వరంగల్ యాంటీ క్వాకరీ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ వద్దిరాజు రాకేశ్, డాక్టర్ శిరీష్ పాల్గొన్నారు.

### మొలకెత్తని చేను పరిశీలన

- ల్యాబ్ రిపోర్ట్ ఆధారంగా చర్యలు : ఏవో
- నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

ఐనవోలు, జూన్ 18 : హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం వెంకటాపురం గ్రామంలో మొలకెత్తని మక్కజొన్న వ్యవసాయ క్షేత్రాన్ని మంగళవారం స్థానిక ఏవో అడుప కవిత పరిశీలించారు. ఒంటిమామిడిపల్లికి చెందిన రైతు బండారి శ్రీను వెంకటాపురం శివారులో 1.20 ఎకరాల భూమిని కౌలు తీసుకొని ఓ కంపెనీకి చెందిన మక్కజొన్న విత్తనాలను మండలకేంద్రంలోని ఓ డీలర్ వద్ద కొనుగోలు చేసి విత్తగా 90శాతం మొలకెత్తలేదు. దీంతో తనకు రూ. 25 వేల వరకు నష్టం వాటిల్లిందని సోషల్ మీడియాలో వీడియో పోస్టు చేయగా వైరల్‌గా మారింది. ఇందుకు సంబంధించి ఈనెల 16న 'మొలకెత్తని మక్కజొన్న విత్తనాలు' శీర్షికన నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. ఈ మేరకు మక్కజొన్న విత్తనాల మొలక శాతం తెలుసుకోవడానికి నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు ఆమె తెలిపారు. ల్యాబ్ రిపోర్టు ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని కవిత పేర్కొన్నారు. కాగా, మండలంలోని ఏ రైతైనా విత్తనాలు మొలకెత్తలేదని డీలర్ల దృష్టికి తీసుకొస్తే గుట్టు చప్పుడు కాకుండా అదే కంపెనీకి చెందిన మరో మక్కజొన్న విత్తనాల బస్తాలను ఉచితంగా ఇచ్చి పంపుతున్నట్లు రైతులు చర్చించుకుంటున్నారు.



వెంకటాపురంలో బండారి శ్రీనుకు చెందిన మొలకెత్తని మక్కజొన్న పంట క్షేత్రాన్ని పరిశీలిస్తున్న ఏవో కవిత